క్లుప్తంగా

నష్టపోయిన రైతుల వివరాలు సేకరణ



రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలలో ఈ నెల 15వ తేదీన భారీగా వీచిన గాలులకు, వర్షానికి దెబ్బతిన్న అరటితోటలను గురువారం పరిశీలించి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి జిల్లా ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్తున్నట్లు గురజాల ఉద్యాన అధికారి వై.మోహన్ తెలిపారు. మండలంలోని గోలి, రెంటచింతలకు చెందిన ఐదుగురు రైతులు సాగు చేస్తున్న 12 ఎకరాలు అరటితోటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. ప్రతికూల వాతావరణం వలన సాగు చేస్తున్న పంటలు దెబ్బతిన్న సమయాలలో బాధిత రైతులు వెంటనే ఉద్యాన, వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఆయప వెంట వీఏఏలు సతీష్‌రెడ్డి, జయశ్రీ, పవన్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థికి జిల్లా కలెక్టర్ అభినందనలు



పిడుగురాళ్ల: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో పిడుగురాళ్ల పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ అబ్దుల్ 470 మార్కులుగాను 466 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో మూడో స్థానం, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈమేరకు విద్యార్థిని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నర్సరావుపేటలోని తన కార్యాలయంలో అభినందించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ సీఎస్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో కూడా మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారన్నారు. అదేవిధంగా 464 మార్కులు సాధించిన విద్యార్థిని లక్ష్మిని సైతం అభినందించారన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల డీఏన్ సుభాని, ఏజీఎం కృష్ణ, లక్ష్మయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి



పిడుగురాళ్ల: పట్టణంలోని కేఎస్ఆర్ విద్యా సంస్థలో గురువారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని నిర్వహించారు. డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు సాదినేని నరసింహారావు, మోటమర్రి సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ మేరీ కనకం బాధ్యతల స్వీకారం



రెంటచింతల: రెంటచింతల తహసీల్దార్‌గా దొప్పలపూడి మేరీ కనకం గురువారం బాధ్యతలు చేపట్టారు. మేరీ కనకం ఇప్పటి వరకు నర్సరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా మూఢావత్ అర్జున్‌నాయక్ పని చేశారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మేరీ కనకం మాట్లాడుతూ మండలంలోని మిట్టగుడిపాడు వీఆర్వోగా 2014 మార్చి నుంచి 2018 ఏప్రిల్ 28 వరకు, 2019 జూలై 27 నుంచి 2023 జూలై 1 వరకు డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించినట్లు తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవిన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు.

ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

పెదకూరపాడు : పెదకూరపాడు మండలం ఆర్‌ఎస్‌కేలో మండల స్థాయి వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలు, సెర్ప్ సిబ్బంది ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బందితో మండల లెవల్ కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ ఎంఏవో శాంతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంటకు ముందు రైతులు పొలంలో పీఎండీస్ చల్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా చీడ పీడల్ని నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అదనపు మేనేజర్ ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ వేయడం వలన నేల గుల్లబారుతుందన్నారు. నీటిని నిలువ చేసుకొనే శక్తి పెరిగి నీటి ఎద్దడిని తట్టుకోగలుగుతుందని చెప్పారు. ఏపీఎం సునీత మాట్లాడుతూ ప్రతి యానిమేటర్ తన పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు.

విశిష్టం.. చెన్నుని రథోత్సవం

- కులాకతీతంగా రథోత్సవం నిర్వహణ
- చాపకూడు సిద్ధాంతాన్ని నేటికీ ఆచరిస్తున్న భక్తులు

మాచర్ల రూరల్: పల్నాడులో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. స్వామి వారి బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి కల్యాణం ప్రముఖం కాగా, కల్యాణం అనంతరం రథోత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దక్షిణాభిముఖంగా రథారూఢుడై పయనించు కేశవుని, లక్ష్మీచెన్నకేశవ స్వామిని దర్శించిన వారికి మళ్లీ జన్మ ఉండదని శాస్త్ర ప్రమాణము. అత్యంత వైభవంగా జరిగే రథోత్సవంలో స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాది మంది ప్రజలు పాల్గొంటారు.

రథసారధిగా సుంకె వాసు చాతుర్యం..

ఈ రథ నిర్వాహణలో ప్రధానంగా గొలుసులు లాగి రథాన్ని ముందుకు నడిపే భక్తులను ఉత్సాహపరుస్తూ జై చెన్నకేశవ.. జై జై చెన్నకేశవా లాంటి నినాదాలు చేస్తూ భక్తిపారవశ్యంగా వంశపారంపర్య రథసారధి సుంకె వాసు చాతుర్యం ఇందులో ఎంతో చెప్పుకోదగింది. ఆయన తండ్రి సుంకె చిన కోటిలింగం 50 సంవత్సరాల నుంచి రథసారధిగా కొనసాగాడు.

వంశపారంపర్యంగా కుంభం తయారీ..

ఉత్సవ మూర్తులైన శ్రీదేవి భూదేవి చెన్నకేశవ స్వామి రథం ఊరేగింపులో శాలివాహన, రజక, వడ్డెరులు అన్నంను కుండల్లో ఉడకబెట్టి ఊరేగింపుగా తీసుకొచ్చి హారతిచ్చి రథ రహదారిలో కుంభం పోసి ఊరేగింపును ప్రారంభిస్తారు. ఈ కుంభం తయారీని వంశపారంపర్యంగా నిర్వహిస్తుంటారు. 900సంవత్సరాల క్రితమే కుల మతాలను ఏకం చేసి అందరికీ దేవాలయ ప్రవేశం చేయించి, చాపకూటి సిద్ధాంతం ప్రవేశపెట్టిన బ్రహ్మనాయుడు తలపెట్టిన ఆచారాలను నేటికీ తు.చ. తప్పక ఆచరిస్తూ పల్నాటి కీర్తి ప్రతిష్టలను ఎలుగెత్తి చాటుతోంది.



రథోత్సవం ప్రారంభానికి ముందు అన్నం వండి కుంభం పోస్తున్న శాలివాహనులు, రజకులు



వంశపారంపర్య రథసారథిగా వ్యవహరిస్తున్న సుంకె వాసు

నగారా మోగితే యువతలో ఉత్సాహం..



నగారా మోగిస్తున్న వాయిద్యకారులు

రథం ముందుకు సాగేందుకు రథంపై డ్రమ్ములతో నగారా మోగితే పల్నాటి యువతలో ఎక్కడ లేని ఉత్సాహం ఉప్పొంగుతుంది. జై చెన్నకేశవ అంటూ గొలుసులు పట్టి రథాన్ని ముందుకు నడపటంలో ఈ నగారా ధ్వని ఎంతో ఉత్సాహంతో పాటు మనసు పులకరించిపోతుంది. రథం ఆగినా, కదలకుండా ఉన్నా ఢమరుకం, నగారా శబ్దాలను మోగిస్తే రథపయనం వేగం అందుకుంటుంది.

కాగడాల వెలుగు చూపే కరణాలు..

అలంకరించిన రథంపై ఊరేగుతున్న స్వామి వారు భక్తులకు కనిపించేందుకు మొదట నుంచి కరణాలు కాగడాలు చేతపట్టి స్వామి వారి సేవలో సేదతీరుతున్నారు. కరణాలుగా ఉన్న వారి కుటుంబీకులు ఎక్కడో దూరంగా ఉన్నత స్థాయిలో ఉన్నా.. రథోత్సవ సమయానికి తప్పనిసరిగా హాజరవుతూ స్వామి వారికి కాగడా దివిటీలను పట్టుకుంటారు.



కంచు కాగడా వెలిగిస్తున్న కరణాలు

రథ పయనంలో చొప్పాల బోయలే కీలకం..

అరవై అడుగుల ఎత్తు, 7 అంతస్తులు, ఆరు చక్రాల రథాన్ని రహదారిలో నడిపించటంలో చొప్పాలు వేసేవారే కీలకం. వీధుల్లో పయనించే రథం సక్రమంగా వెళ్లేందుకు వీరు వేసే చొప్పాలకు ఎంతో ప్రాధాన్యముంటుంది. అతి పురాతన చరిత్ర కలిగిన రథాన్ని సక్రమమైన మార్గంలో పయనించేలా చూడటంలో చొప్పాలు వేసే వారి కృషి ఎనలేనివి. స్వామివారి పై భక్తిశ్రద్ధలతో వంశపారంపర్యంగా నిర్వహిస్తున్న వీరి కృషి కొనియాడదగింది.



రథం ప్రయాణించే మార్గంలో చొప్పాలు వేస్తున్న రథ బోయలు

రథోత్సవంలో స్వచ్ఛంద సేవలు



కూరగాయల మార్కెట్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్



శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయ సభ్యులచే సుగంధ పానీయం పంపిణీ

మాచర్ల రూరల్: శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఉచితంగా అన్నదానం, మజ్జిగ, సుగంధ పానియాలు పంపిణీ చేశారు. బ్రహ్మనాయుడు కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేస్తారు. అలాగే తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గాజుల చెన్నయ్య నేతృత్వంలో పులిహోర, మజ్జిగ, శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానం కమిటీ నేతృత్వంలో అధ్యక్షుడు భవనాశి వెంకటేశ్వర్లు, సెక్రటరీ సన్నిధి హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావు లు సుగంధ పానీయం భక్తులకు అందజేశారు. స్వచ్ఛంద సేవకుడు చల్లా శ్రీను ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, బొబ్బిలి గడ్డలో నక్షత్రపు కుటుంబీకులు పులిహోర, మజ్జిగను భక్తులకు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక వేడుకలు

సత్తెనపల్లి: పట్టణ తాలూకా సెంటర్ సమీపంలోని సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి తొమ్మిదవ వార్షిక వేడుకలు సత్తెనపల్లి రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామిని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులైన సత్తెనపల్లి రూరల్ పోలీసులు మాట్లాడుతూ వివిధ రకాల గొడవలు, తగాదాలు, వర్గపోరు, ఇలా నిత్యం బాధితులతో పోలీస్ స్టేషన్ నిండిపోతుందన్నారు. వివిధ నేరారోపణలతో వచ్చేవారికి కొంతమేరకైనా ఆధ్యాత్మికత, సత్ప్రవర్తన కలుగుతాయని తమ వంతుగా స్టేషన్ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రతి రోజు స్వామి వారికి పూజలతో పాటు ప్రతి సంవత్సరం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

భక్తిశ్రద్ధలతో హోమాలు.. ప్రత్యేక పూజలు



హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

పాలువాయిజంక్షన్(రెంటచింతల): మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద వేంచేసిన షిరిడీ సాయిబాబా దేవస్థానం గురువారం 25వ వార్షికోత్సవం (సిల్వర్ జూబ్లీ) వేడుకలను వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు గోపాల్‌పాండే నేతృత్వంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు, పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు బ్రహ్మశ్రీ జిగురు వెంకటలక్ష్మీ నరసింహశర్మ నేతృత్వంలో మూలమంత్ర అనుష్టానములు, హవనములు, స్వామివారికి పూర్ణాహుతి నిర్వహించారు. 11 గంటలకు స్వామివార్లకు ప్రధాన కలశాభిషేకం, ఆశీర్వచనం చేపట్టిన అనంతరం పండిత సన్మానం జరిపించారు. మందిరం ఆవరణలో సామూహిక సాయివ్రతాలు, దత్తాత్రేయ వ్రతాలతోపాటు వివిధ రకాల హోమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు బాబాకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. మహిళలు ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. ఈ వార్షికోత్సవం పాల్గొన్న వేలాదిమంది భక్తులకు మహాన్నదాన కార్యక్రమం చేపట్టారు. మందిరాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు. మందిర చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకారంలో షిరిడీ సాయిబాబా

అగ్నిప్రమాదాలపై అవగాహన ముఖ్యం

పిడుగురాళ్ల టౌన్ సీఐ శ్రీరాం వెంకట్రావు

పిడుగురాళ్ల: అగ్నిప్రమాదాలపై అప్రమత్తత, అవగాహన ముఖ్యమని పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని స్కాలర్ స్కూల్ విద్యార్థులతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించి, అనంతరం పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్రావు మాట్లాడుతూ...ప్రజలు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు పడకుండా ధైర్యంతో ప్రమాదాలను నివారించాలని, కంగారు పడటం వలన అగ్నిప్రమాదాలు అదుపు చేయలేమని ఆయన తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీనివాసరావు, స్కాలర్ స్కూల్ డైరెక్టర్లు జి.శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అగ్నిమాపక శాఖ సిబ్బంది, స్కాలర్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ శ్రీరాం వెంకట్రావు, అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీనివాసరావు

అనుమతి లేకుండా వెంచర్లు వేసిన వారికి నోటీసులు

క్రోసూరు: క్రోసూరులో అనుమతి లేకుండా వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధం చేసిన నలుగురికి నోటీసులు ఇచ్చినట్లు తహసీల్దార్ వీవీ నాగరాజు గురువారం తెలిపారు. నోటీసులందుకున్న వారు 15 రోజుల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గతంలోనే అనుమతులున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మరి కొందరికి త్వరలో నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ అవార్డు అందుకున్న ఎంఈఓకు సన్మానం



ఎంఈఓ ఏకుల ప్రసాదరావును సన్మానిస్తున్న ఎంపీపీ కోటయ్య

క్రోసూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి ఏకుల ప్రసాద్‌రావును ఎంపీపీ పి.కోటయ్య, ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల హానరబుల్ చైర్మన్ జి.దాసు, పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా దక్షిణ భారత ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా అవార్డును అందుకున్న ఎంఈవో ఏకుల ప్రసాదరావుకు గురువారం సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవోను ఎంపీపీ పి.కోటయ్య, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి చైర్మన్ గార్లపాటి దాసు శాలువాలతో, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించినారు. అనంతరం ఎంపీపీ కోటయ్య మాట్లాడుతూ ప్రసాదరావు మండల విద్యాశాఖ అధికారిగా క్రోసూరు మండలంతో పాటు అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు మండలాల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. గార్లపాటి దాసు మాట్లాడుతూ ఏకుల ప్రసాదరావు విద్యార్థులకు ఎంతగానో తోడ్పడతారని అన్నారు. ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రాధ రమణశ్రీ, ఏపీవో పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యం



సత్తెనపల్లి: అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని భవిష్య స్కూల్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు ఎలా ఎదుర్కోవాలో డెమో ద్వారా ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో భవిష్య పాఠశాల కరస్పాడెంట్ ఐ.శ్రీధర్, స్కూల్ సిబ్బంది, సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఆలా శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ సీహెచ్ సాగర్ బాబు, ఫైర్‌మాన్‌లు ఎం.మోహన్ బాబు, బి.నాగేశ్వరరావు, ఎస్‌కే బాజీ, సిబ్బంది ఉన్నారు.

నేడు తుమ్మకోట శివాలయం భూములకు వేలం

ఈఓ గాదె రామిరెడ్డి

రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో వేంచేసిన మల్లేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం మాన్యం) భూములకు శుక్రవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం దేవస్థానం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలువాయి జంక్షన్ బంగ్లా దగ్గర నున్న దేవస్థానానికి చెందిన భూములకు నిర్వహించే ఈ బహిరంగ వేలంలో పాల్గొని పాడుకున్న వారు 3 సం.లపాటు కౌలు హక్కును పొందటం జరుగుతుందన్నారు. మొత్తం 28.65 ఎకరాల మెట్టభూమికి జరిగే ఈ వేలంలో పాల్గొనే వారు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు. కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలాఖరులో సంబంధిత నగదు చెల్లించి భూమిలో ప్రవేశించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

కార్యకర్త కుటుంబానికి పీఆర్కే ఆర్థికసాయం



సిద్దా భార్య సైదాబీకి ఆర్థిక సాయం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

రెంటచింతల: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తాను, పార్టీ అధిష్టానం ఎల్లవేళల అండగా ఉంటామని పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని మిట్టగుడిపాడు గ్రామానికి దూదేకుల సిద్దా కుటుంబాన్ని ఆదుకునేందుకు మృతుని భార్య సైదాబీకి రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని పార్టీ నాయకుడు గొట్టం భాస్కర్‌రెడ్డి ద్వారా అందచేశారు. మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జాతీయ రహదారి అసంపూర్తిగా నిర్మాణ పనులు చేపట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టరు అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. భాస్కరరెడ్డి వెంట పార్టీ గ్రామ అధ్యక్షుడు గొట్టం సర్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వట్టి శ్రీనివాసరెడ్డి, సోము శివారెడ్డి, పార్టీ నాయకులు షేక్ జానీబాషా, ఒంగోలు మస్తాన్, షేక్ చిన మౌలాలి తదితరులున్నారు.

ప్రేమ, సేవ కలయికే పవిత్ర గురువారం



పవిత్ర గురువారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న వేలాదిమంది భక్తులు

కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: ప్రేమ, సేవ కలయికే పవిత్ర గురువారమని కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అన్నారు. పవిత్ర గురువారాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక కానుకమాత చర్చి ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక దివ్య పూజాబలిని ఫాదర్ వైఎల్ మర్రెడ్డి సమర్పించి భక్తులను ఉద్దేశించి, మాట్లాడారు. పస్కా పండుగ క్రైస్తవులకు ఎంతో ముఖ్యమైనదన్నారు. దేవుడు ఇశ్రాయేలు ప్రజలను బానిసత్వం నుంచి విముక్తులను చేసిన సంఘటనను ఈ పస్కా భోజనం ద్వారా స్మరించుకుంటారన్నారు. పస్కా భోజనాన్ని కడరాత్రి భోజనంగా యేసుక్రీస్తు తన శిష్యులతో చివరిసారి చేశారన్నారు. ఈ కడరాత్రి భోజనం ద్వారా యేసు ప్రపంచమానవాళికి సోదర ప్రేమ అనే నూతన ప్రేమ ఆజ్ఞ, దివ్యసత్ప్రసాద స్థాపన, గురుత్వ స్థాపన అనే మూడు వరాలను ప్రసాదించారన్నారు. దివ్యపూజాబలి సమర్పించడం, విశ్వాసులకు దివ్య సత్ప్రసాదం ఇచ్చే అర్హత అభిషేకింపబడే ఒక్క గురువులకు మాత్రమే ఉంటుందన్నారు. యేసుప్రభువు కడరాత్రి భోజన సమయంలో తన 12 మంది శిష్యులకు కాళ్లు కడిగి వారిని గురువులుగా అభిషేకించి రొట్టె, ద్రాక్షారసాలను అందించి, తనలాగే చేయమని గురుత్వ బాధ్యతలను ఇవ్వడం జరిగిందన్నారు. గురువులు యేసుప్రభువు త్యాగనిరితిని ప్రతిదినం దివ్యపూజలో కొనియాడుతున్నారన్నారు. అప్పటి నుంచి గుడ్‌ఫ్రైడే ముందు రోజు గురువులు 12 మంది శిష్యులకు పవిత్ర గురువారం రోజు కాళ్లు కడిగి స్మరించుకోవడం జరుగుతుందన్నారు. సహాయ గురువులు రెవ.ఫాదర్ జి.అగస్టీన్, ఫాదర్ కొణతం ఎలీషా రాజు, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



సమష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న విచారణ గురువులు రెవ.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని నిరసన

పెదకూరపాడు : భారతీయ ప్రమాణికల ప్రకారం ఆరు సంవత్సరాల పాటు విధులు పూర్తిచేసిన సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలను క్రమబద్ధీకరించాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరణ చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు గురువారం శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సీహెచ్‌ఓల అధ్యక్షురాలు అనుపమ మాట్లాడుతూ పైన పేర్కొన్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వం కృషి చేయాలని, రాష్ట్ర సంఘం పిలుపుమేరకు దశలవారీగా నిరసనలు చేస్తున్నామని తెలిపారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినోద్‌బాబు, సంఘ నాయకులు రాగిణి, ఖాశీదా, మేరీ, శివకుమారి, రజని, మల్లేశ్వరి, రమాదేవి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి బీజేపీ పటిష్టతకు కృషి

మాచర్ల రూరల్: దేశంలోనే 18 కోట్ల సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీయేనని బూత్ లెవల్ కమిటీ నుంచి జాతీయ స్థాయిలో పార్టీ అభివృద్ధిలో తామంతా సమష్టిగా పనిచేయనున్నట్లు ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ తెలిపారు. గురువారం స్థానిక వీవీఎస్ గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీ పాత్ర ఎంతో కీలకమైందని, స్థానిక సంస్థల నుంచి నామినేటెడ్ పోస్టులలో బీజేపీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశం పై చర్చిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, గొబ్బూరి శ్రీను, కుమార్ వెలిదండి శ్రీనివాసరావు, గంజర్ల లక్ష్మి, ఆలేటి సామేలు తదితరులున్నారు.